
మహబూబ్‌నగర్ అక్షర హైస్కూల్‌లో..


అడ్డాకులలో ఉట్టి కొడుతున్న యువకులు


జిల్లా కేంద్రంలోని శ్రీకృష్ణ మందిరంలో..


గండేడ్‌లో..

గోకుల కృష్ణ.. గోపాలకృష్ణ

- ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణ
- ఉత్సాహంగా ఉట్లు కొట్టిన యువకులు


మూసాపేట మండలం చక్రాపూర్‌లో..

స్టేషన్ మహబూబ్‌నగర్: కృష్ణాష్టమి వేడుకలను గురువారం జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని పద్మావతి కాలనీ మురళీ కృష్ణ మందిరంలో స్వామివారికి కళశాభిషేకం, పంచామృతాభిషేకం, విష్ణు సహస్రనామ పారాయణం తదితర పూజలు చేశారు. సాయంత్రం ఉట్లోత్సవం, స్వామివారి రథోత్సవం నిర్వహించారు. సింహగిరిలోని లక్ష్మీనృసింహస్వామి ఆలయ ఆవరణలో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు.

మహబూబ్‌నగర్ రూరల్: అఖిలభారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార సంఘం భవనంలో యాదవ దంపతులు శ్రీకృష్ణ వ్రతం, ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారుల వేషధారణ, నృత్యాలు ఆకట్టుకున్నాయి. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఆధ్వర్యంలో తెలుగుగూడెం, కోడూర్ తండాల్లో శ్రీకృష్ణ భగవానుడి ఊరేగింపు నిర్వహించారు.

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని అక్షరహైస్కూల్‌లో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రమా మొగులప్ప, ప్రిన్సిపాల్ నర్సింహులు పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: పట్టణంలోని శ్రీకృష్ణుడి ఆలయంలో ప్రత్యేక పూజలు, డోలాహరణం నిర్వహించారు. వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో బాలకృష్ణ భక్త సమాజం ఆధ్వర్యంలో దాండియా ఆటలు, భజనలు అలరించాయి. సరస్వతి శిశుమందిరంలో చిన్నారులతో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. కావేరమ్మపేట శ్రీకృష్ణయాదవ సంఘం ఆధ్వర్యంలో వేడుకలను వైభవంగా నిర్వహించారు.

దేవరకద్ర: మండల కేంద్రంలోని చెన్నకేశవస్వామి ఆలయంలో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో శ్రీకృష్ణుడి డోలారోహణం, పల్లకీసేవ నిర్వహించి.. ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా చిన్నారుల వేషధారణ అందరినీ ఆకట్టుకుంది.



అడ్డాకుల: మూసాపేట, అడ్డాకుల మండలాల్లో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అడ్డాకుల, కందూర్, శాఖాపూర్, పొన్నకల్, బలీదుపల్లి, కన్మనూర్, చక్రాపూర్, జానంపేట పోల్కంపల్లి, నిజాలాపూర్, వేముల, మహ్మదుస్సేన్‌పల్లి గ్రామాల్లో ఉత్సాహంగా ఉట్లు కొట్టారు.

గండేడ్: మండల కేంద్రంతోపాటు వెన్నాచేడ్, కొంరెడ్డిపల్లి, పగిడ్యాల్, పెద్దవార్వాల్, రుసుంపల్లి తదితర గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణతో ఆకట్టుకున్నారు. ప్రధాన కూడళ్లల్లో ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు.


జిల్లా కేంద్రంలోని మురళీకృష్ణ మందిరం ఆవరణలో ఉట్టి కొడుతున్న యువకులు


జడ్చర్ల సరస్వతి శిశుమందిరంలో..

చిన్నచింతకుంట: మండలంలోని అమ్మాపూర్ గ్రామ సమీపంలో కొలువుదీరిన కురుమూర్తిస్వామి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేకం, డోలాహరణం, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు.

సంపూర్ణ అక్షరాస్యత సాధించాలి..

నవాబుపేట: యాదవులు సంపూర్ణ అక్షరాస్యత సాధించాలని సంఘం మండల అధ్యక్షుడు యాదయ్య అన్నారు. మండల కేంద్రంలో శ్రీకృష్ణ భగవాన్ ధ్వజాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు, శ్రీనివాస్, కేశవ్, అంజయ్య, మల్లేష్, సర్పంచులు వెంకటేష్, మల్లేష్, సత్యం, నరేష్, నర్సింహులు, వెంకటయ్య, నరేష్, రఘు, రామకృష్ణ పాల్గొన్నారు.




శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు


మహబూబ్‌నగర్ మండలం తెలుగుగూడెంలో..


కురుమూర్తిస్వామి ఆలయంలో..


దేవరకద్రలో..

క్లుప్తంగా

బంగారు ఆభరణాలతో అలంకరణ

స్టేషన్ మహబూబ్‌నగర్: శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా వాసవీ కన్యకాపరమేశ్వరిని బంగారు ఆభరణాలతో అలంకరించనున్నట్లు ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్, వేణుగోపాల్, కోశాధికారి నాగరాజు గురువారం ప్రకటనలో తెలిపారు. భక్తులు అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు.

సబ్సిడీపై దాణ పంపిణీ



భూత్పూర్: మండలంలోని కొత్త మొల్గరలో ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు నర్సింహులుగౌడ్ గురువారం గొర్రెల పెంపకందారులకు సబ్సిడీపై దాణ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నారాయణగౌడ్, ఉపసర్పంచ్ మురళి, మండల పశువైద్యాధికారి మదుసూదన్, శేఖర్‌గౌడ్, నారాయణగౌడ్, రమేష్, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదాతలుగా నిలవాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): అర్హులైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని సహాయ ఫౌండేషన్ అధ్యక్షుడు శివప్రసాద్‌యాదవ్ కోరారు. అనారోగ్యంతో జిల్లా కేంద్రంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నవీన్ అనే వ్యక్తికి అవసరమైన ఓ పాజిటివ్ రక్తాన్ని గురువారం శివప్రసాద్ దానం చేశారు. ఆపదలో ఉన్న వారికి ఫౌండేషన్ సభ్యులు రక్తదానం చేస్తున్నట్లు తెలిపారు.

లక్ష్మీచెన్నకేశవస్వామి ఉత్సవాలు



అడ్డాకుల: మూసాపేట మండలం కొమిరెడ్డిపల్లిలో లక్ష్మీచెన్నకేశవస్వామి ఉత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ చైర్మన్ లింగారెడ్డి ఆధ్వర్యంలో ధర్మకర్తలు కళాధరాచారి, మాధవాచారి ఇంటి నుంచి స్వామివారి ఉత్సవమూర్తులకు పల్లకీసేవ నిర్వహించారు. అనంతరం చెన్నకేశవస్వామి గుట్టపైకి చేరుకుని విగ్రహాలను ఆలయంలో ఉంచి, ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం లక్ష్మీచెన్నకేశవస్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సాయిరెడ్డి, మాజీ ఎంపీపీ బగ్గి కృష్ణయ్య, ఉపసర్పంచ్ రఘుపతి, బుచ్చన్న, రంగన్న, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి..

గండేడ్: మండలంలోని గోవింద్‌పల్లి వరహగిరి గట్టు చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలను శనివారం నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

‘ప్రభుత్వ తీరు సరికాదు’

కోయిల్‌కొండ: గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించాలని 228 రోజులుగా రిలే దీక్ష చేపట్టినా ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరించడం సరికాదని జేఏసీ కన్వీనర్ రామునాయక్, వెంకట్రామిరెడ్డి అన్నారు. గురువారం రిలే దీక్షలో వారు పాల్గొని మాట్లాడారు. గార్లపహాడ్ మండల ఏర్పాటుకు 12 గ్రామాల ప్రజల మద్దతు తెలియజేస్తున్నా ఉన్నతాధికారులు, పాలకులు పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. అన్ని అర్హతలు ఉన్న గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

సదస్సును జయప్రదం చేయండి

మిడ్జిల్: ఈనెల 10న జడ్చర్లలో నిర్వహించనున్న బీఆర్‌ఎస్ యూత్ సదస్సును విజయవంతం చేయాలని మండల అధ్యక్షుడు బంగారు కోరారు. మండలంలోని వెలుగొమ్ములలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలం నుంచి యువత అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. సమావేశంలో భీంరాజ్, రాములు, మన్యం, సాయన్న, సత్యం, లక్ష్మారెడ్డి, శేఖర్‌రెడ్డి, కృష్ణయ్య ఉన్నారు.

విద్యుదాఘాతంతో కాడెద్దు మృతి

మహమ్మదాబాద్: మండలంలోని గాధిర్యాల్‌కు చెందిన బోడ భీమయ్య కాడెద్దు గురువారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. వ్యవసాయ పొలంలో మేతకు వెళ్లిన కాడెద్దు.. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వైర్లకు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందిందని బాధిత రైతు తెలిపారు. కాడెద్దు విలువ రూ.60వేలు ఉంటుందని, ప్రభుత్వపరంగా ఆదుకోవాలని కోరారు.

ఆదర్శప్రాయుడు.. కొరివి కృష్ణస్వామి

గండేడ్: హైదరాబాద్ తొలి మేయర్ కొరివి కృష్ణస్వామి అందరికీ ఆదర్శప్రాయుడని ముదిరాజ్ సంఘం మండల గౌరవాధ్యక్షుడు కొమిరె లక్ష్మయ్య, అధ్యక్షుడు బోయిని గోపాల్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో కృష్ణస్వామి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ నిజాం హయాంలో ముదిరాజ్‌ల అభ్యున్నతికి ఆయన ఎంతో కృషి చేశారన్నారు. తొలి మేయర్‌గా బాధ్యతలు చేపట్టి హైదరాబాద్ నిర్మాణంలో కీలకపాత్ర పోషించారని కొనియాడారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మెడికల్ ఆఫీసర్ చంద్రశేఖర్ సమక్షంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ర్యాకం కేశవులు, ఏపీ రాములు, శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు అంజిలయ్య, వెంకటయ్య, ఆంజనేయులు, కొత్త గోపాల్, కుందేటి కిష్టయ్య, చంద్రయ్య, వెంకటయ్య, శంకరయ్య, సాయిలు, యాదగిరి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.


గండేడ్‌లో కృష్ణస్వామి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ముదిరాజ్ నాయకులు

11 నుంచి అంగన్‌వాడీల సమ్మె

మహబూబ్‌నగర్ న్యూటౌన్: అంగన్‌వాడీ సిబ్బందిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 11 నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి తెలిపారు. అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లను క్రమబద్ధీకరించి, వేతనాలు పెంచాలని కోరారు. సమావేశంలో సరోజ, రాజ్‌కుమార్, కవిత, సుజాత, లీలావతి పాల్గొన్నారు.

మట్టిరోడ్డు పనులు ప్రారంభం


కొల్లూర్ తండాలో మట్టిరోడ్డు పనులను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

నవాబుపేట: మండలంలోని ఎర్రవాడ్కతండా నుంచి మల్లన్నగుట్టతండా వరకు మట్టిరోడ్డు నిర్మాణ పనులను గురువారం జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సొంత ఖర్చులతో మారుమూల ప్రాంతాలకు రోడ్డు సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే 15 గ్రామాలకు దాదాపు రూ.కోటి వ్యయంతో రోడ్లు నిర్మిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ అనంతయ్య, రైతుబంధు సమితి మండల చైర్మన్ మధుసూధన్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ సంతోష్‌రెడ్డి, ముడా డైరెక్టర్ చెన్నయ్య, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ చందర్‌నాయక్, సర్పంచులు సౌజన్య, మాన్యానాయక్, ప్రతాప్, రఘు, కృష్ణగౌడ్, వెంకటేష్, రఘుగౌడ్, సేవ్యానాయక్, భద్రునాయక్ పాల్గొన్నారు.

హిందువుల సంఘటితమే వీహెచ్‌పీ లక్ష్యం

స్టేషన్ మహబూబ్‌నగర్: దేశంలో హిందూ సమాజం సంఘటితం కోసమే విశ్వహిందూ పరిషత్ ఆవిర్భవించిందని ఆ సంస్థ ప్రతినిధులు అన్నారు. వీహెచ్‌పీ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం జిల్లా కేంద్రంలోని సంస్థ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాషాయ జెండాను ఎగురవేశారు. అదేవిధంగా శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకొని కృష్ణుడికి ప్రత్యేక పూజలు, లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. కార్యక్రమంలో నరేంద్ర, జనార్దన్, చంద్రయ్య, బుచ్చిరెడ్డి, హన్మంతు, శంకర్, శ్రీధర్, శ్రీనివాసులు, విఘ్నేష్, భరత్ కుమార్, గురురాజ్, దినకర్, నిరంజన్, ఆంజనేయులు, సంధ్య, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.


వీహెచ్‌పీ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న ప్రతినిధులు

కాంగ్రెస్ పార్టీకే ప్రజల మద్దతు

మహబూబ్‌నగర్ రూరల్: బీఆర్‌ఎస్ పాలనలో విసుగు చెందిన ప్రజలు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారని టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఉబేదుల్లా కొత్వాల్ అన్నారు. మండలంలోని కోడూర్‌లో గురువారం పార్టీ మండల అధ్యక్షుడు మల్లు నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికెళ్లి పోస్టుకార్డుల మీద సంతకాల సేకరణ చేపట్టారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాలను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభివృద్ధే కాంగ్రెస్ ధ్యేయమని, రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం తీసుకొద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, ఎన్పీ వెంకటేష్, బెక్కరి అనిత, మధుసూదన్‌రెడ్డి, లక్ష్మణ్‌యాదవ్, సిరాజ్ ఖాద్రీ, జె.చంద్రశేఖర్, లక్ష్మణ్, అబ్దుల్లా, కృష్ణయ్య, అంజయ్య, చిన్న అంజయ్య, మాధవరెడ్డి, గోవిందుయాదవ్, రామచంద్రయ్య, రంగయ్య, శేఖర్‌రెడ్డి, వీరన్న, బాలయ్య, రఘు, నాగయ్య, రాజుగౌడ్, తిరుపతయ్యయాదవ్ పాల్గొన్నారు.


కోడూర్‌లో పర్యటిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నవాబుపేట: నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం వస్తోందని జిల్లా ప్రధాన కార్యదర్శి బంగ్లరవి అన్నారు. గురువారం మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షులు రాంచంద్రయ్య, అల్వాల్‌రెడ్డి, శంకర్‌నాయక్, కృష్ణయ్య, వెంకటయ్యను శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం రవి మాట్లాడుతూ పార్టీ గెలుపునకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో రమేష్‌గౌడ్, వెంకటేష్, రాజశేఖర్, జంగన్న, లక్ష్మయ్య, చారి పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డిని కలిసిన నాయకులు..

మహమ్మాదాబాద్: టీపీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి రాములు ఆధ్వర్యంలో గురువారం కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు హైదరాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా మండల రాజకీయాలపై చర్చించినట్లు తెలిపారు.

నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి


జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: పెంచిన నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయం నుంచి తెలంగాణ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి, ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలు నియంత్రిస్తామని చెప్పి.. మోసం చేస్తోందని ఆరోపించారు. సంవత్సరానికి రెండుకోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీ అమలుకు నోచుకోలేదన్నారు. పెంచిన ధరలను తక్షణమే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కిల్లె గోపాల్, కురుమూర్తి, వి పద్మ, చంద్రకాంత్, మోహన్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

భూత్పూర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కురుమూర్తి ఆరోపించారు. భూత్పూర్ చౌరస్తాలో గ్రామపంచాయతీ కార్మికులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యావసర సరకుల ధరలను విపరీతంగా పెంచి, సామాన్యులపై పెనుభారం మోపుతోందన్నారు. పెట్రోలు, డీజిల్, వంటగ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మైబు, నారాయణ, వెంకటేష్, మైసమ్మ, కృష్ణయ్య, రాఘవేందర్, చంద్రమ్మ, అంజమ్మ, రమేష్ పాల్గొన్నారు.

ఉపవాసంతో ప్రార్థిస్తే అద్భుతాలు


ఫ్రెడీపాల్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నిర్వాహకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: ఉపవాసంతో యదార్థంగా దేవుడిని ప్రార్థిస్తే అద్భుతాలు సృష్టిస్తాడని హోసన్న మినిస్ట్రీస్ నిర్వాహకుడు పాస్టర్ ఫ్రెడీపాల్ అన్నారు. రెమా వర్షిప్ సెంటర్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని విజన్ గార్డెన్‌లో పాస్టర్ బీఎస్ పరంజ్యోతి అధ్యక్షతన ఉపవాస ప్రార్థన పండుగలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పాస్టర్ ఫ్రెడీపాల్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఎదురయ్యే పరిస్థితులతో ఒత్తిడికి లోనుకాకుండా దేవుడిపై భారం వేసి ధైర్యంగా ముందుకు సాగాలన్నారు. ఉపవాస ప్రార్థనల ప్రాముఖ్యతను తెలియజేసేందుకు మూడు రోజుల పాటు ప్రార్థన కార్యక్రమాలను ఏర్పాటు చేసిన పాస్టర్ పరంజ్యోతిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పాస్టర్లు శామ్యూల్, వేదాంతి, తిమోతి, ప్రసాద్‌బాబు, బల్‌రాం, దేవయ్య, లక్ష్మన్న, అనిల్ పాల్గొన్నారు.

ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల నిరసన

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: సమగ్రశిక్ష అభియాన్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఆ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్‌లో గురువారం నిరసన వ్యక్తం చేశారు. శ్రీనివాస్, హర్షకుమార్ పాల్గొన్నారు.



పే..ద్ద లారీ

అడ్డాకుల: లారీకి పది లేదా ఇరవై టైర్లు ఉండటం సహజం. భారీ వాహనాలకు 100లోపు టైర్లు ఉంటాయి. కానీ 154 టైర్లతో ఓ లారీ 44వ జాతీయ రహదారిపై వెళ్లడం గురువారం కనిపించింది. ముంబై నుంచి తోషిబా పరిశ్రమకు చెందిన భారీ యంత్రాన్ని లారీపై బెంగళూర్‌కు తరలిస్తున్నట్లు డ్రైవర్లు తెలిపారు. భారీ వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే వాహనదారులు, ప్రయాణికులు ఆసక్తిగా తిలకించారు.